క్లుప్తంగా

వైభవంగా వీరభద్రస్వామి పల్లకీ సేవ



అల్లాడుపల్లెలో వీరభద్రస్వామి పల్లకీ సేవ ఊరేగింపు

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థానంలో సోమవారం వీరభద్రస్వామి ఉత్సవ విగ్రహ మూర్తులకు ఘనంగా పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జీవై వెంకటసుబ్బారెడ్డి(ఉదయ్) ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సోమవారం తెల్లవారుజాము నుంచి వీరభద్రస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరభద్రస్వామి సమేత భద్రకాళీమాతలను ప్రత్యేకంగా అలంకరించి భక్తుల నడుమ పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా పల్లకి సేవలో పాల్గొన్న భక్తులకు స్వామి ప్రసాదం పంపిణీ చేసి, అన్నసత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో సోమవారం పౌర్ణమి పర్వదిన సందర్భంగా ఘనంగా చండీ హోమాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, ఉప దేవతా హోమాలు, మృత్యుంజయ, చండీ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, వేదపాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరశర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

28 నుంచి పాలిసెట్ కోచింగ్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లోని జేవీవీ కార్యాలయంలో 28 నుంచి జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఉచిత పాలిసెట్ శిక్షణ ఇవ్వనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్.శివారెడ్డి, సునీత తెలిపారు. సోమవారం కార్యాలయంలో కోచింగ్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. 10వ తరగతి పూర్తయిన విద్యార్థులకు 28 నుంచి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 వరకు కోచింగ్ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 9398722704 నంబరుకు సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు గోపీనాథరెడ్డి, రాజేష్, సురేష్, మాబువల్లి, మురళీగుప్త, రవిశంకర్, ప్రియాంక, కిరణ్, ప్రకాష్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

30న వెల్లాలలో తలనీలాల వేలం

రాజుపాళెం : వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వాముల ఆలయాలకు సంబంధించి ఈ నెల 30న తలనీలాల వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బి.జగదీశ్వరరెడ్డి, ఈఓ నరసయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే ప్రతి పాటదారుడు రూ.లక్ష డిపాజిట్ నగదు రూపంలో చెల్లించాలని, ఈ ఆలయానికి సంబంధించి భక్తులు సమర్పించిన తలనీలాలను ఏడాదిపాటు పోగు చేసుకోవచ్చునని తెలిపారు.

ఉగాది సంబరాలకు ఏర్పాట్లు



సమావేశమైన విశ్వ హిందూ పరిషత్ మండల సభ్యులు

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో సోమవారం విశ్వ హిందూ పరిషత్ మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో జరగబోయే ఉగాది పండుగను అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించాలని, సంప్రదాయబద్ధంగా చేసుకునేలా ప్రజలందరినీ చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ మండల సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, భవానీ శంకర్, మండల కన్వీనర్ విశ్వేశ్వరరెడ్డి, మండల నాయకులు మనోహర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎన్నికల ప్రచారం ప్రారంభం

- కేశాపురం నుంచి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి శంఖారావం
- నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి తరలివచ్చిన నాయకులు
- ప్రజల నుంచి అడుగడుగునా విశేష స్పందన



కేశాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

బ్రహ్మంగారిమఠం : మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం అట్టహాసంగా ప్రారంభించారు. మండలంలోని ముడుమాల పంచాయతీ కేశాపురం గ్రామం నుంచి ఉదయం 9 గంటలకు ఎన్నికల శంఖారావం పూరించారు. 2014, 2019లలో ఎన్నికల ప్రచారం నియోజకవర్గంలోని ఈశాన్యం నుంచి, అందులో బి.మఠం మండలంలో కేశాపురం గ్రామం నుంచి ప్రారంభించారు. ఈ ఏడాది కూడా ఆ ఆనవాయితీ పాటించారు. ప్రజల నుంచి అడుగడుగునా విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఉప మండలాధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, ఎమ్మెల్యే కుమారులు శెట్టిపల్లె నాగిరెడ్డి, శెట్టిపల్లె అశోక్‌రెడ్డి(బాజీ), బి.మఠం జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్ ఉన్నారు. కేశాపురంలో ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిల ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల ప్రజలకు చేసిన సంక్షేమ పథకాల పోస్టర్‌ను గ్రామస్తులకు అందించారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం సంక్షేమం అందిందని ఓటర్లు ఎమ్మెల్యేతో తెలిపారు. తిరిగి జగన్ ముఖ్యమంత్రిగా ఉండాలని వారు కోరుకున్నారు. ప్రజలు అన్ని విధాలుగా బాగుండాలంటే, తిరిగి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ కావాలంటే, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అంతకు ముందు ఒక్కసారిగా కార్యకర్తలతో ఎమ్మెల్యే గ్రామంలోకి చేరుకోగానే స్థానిక ఎంపీటీసీ భర్త శీలం రామగురివిరెడ్డి, సర్పంచ్ భర్త శీలం పెద్దిరెడ్డిలు ఘన స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించారు.

హామీలన్నీ నెరవేర్చాం.. మళ్లీ ఆశీర్వదించండి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని, అందుకే ప్రజల వద్దకు తిరిగి వెళ్లినా తమను ఆశీర్వదిస్తున్నారని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. కేశాపురం గ్రామంలో సర్పంచ్ శీలం లక్ష్మీదేవి ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఐదేళ్లలో సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ 2.65 లక్షల కోట్లు ఖర్చుచేయడం జరిగిందన్నారు. ఎక్కడా, ఎలాంటి అవినీతికి తావులేకుండా నేరుగా మహిళల బ్యాంక్ ఖాతాలలోకి డబ్బు వెళ్లిందన్నారు. విద్య, వైద్య రంగాల్లో నాడు- నేడు కింద అభివృద్ధి గణనీయంగా జరిగిందన్నారు. బ్రహ్మంసాగర్‌లో 17 టీఎంసీల నీటిని నిల్వ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. పార్టీలకు, కులాలకు అతీతంగా సంక్షేమం అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. అలాగే నేను మీకు మంచి చేసి ఉంటే మరొక్క సారి నాకు ఓటు వేయండి అనే సీఎం దేశంలో ఎక్కడా కనిపించరు అన్నారు. ఆ ధైర్యం గత పాలకులకు ఉందా అన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్ కుటుంబంతో కలిసిన వారు ఇతర పార్టీలకు వెళ్లలేరు అన్నారు. ఎందుకంటే యాదవ సామాజిక వర్గం అయిన నేను ఈరోజు ఎమ్మెల్సీ స్థాయిలో ఉన్నాను అంటే ఒక్కసారి ప్రజలు కూడా గమనించాలన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో ప్రజల కోసం తపించే నాయకుడు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఇప్పుడు ఆయనకు పోటీగా ఉన్న వ్యక్తి ప్రజలకు అందుబాటులో ఉండే వారు కాదన్నారు. జరగబోయే ఎన్నికల్లో మన పెద్దాయనకు గత ఎన్నికల కన్నా మెజార్టీ అధికంగా తెప్పిద్దామన్నారు. రెడ్యం వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డి రెండవ సారి ముఖ్యమంత్రి, మూడవసారి ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డి, హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధంగా మన పెద్దాయన ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఉన్నారని తెలిపారు. కావున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ 45 రోజులు ప్రతి గ్రామం, ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం గురించి తెలిపి ఓటు అడగాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. చెప్పిన మాటను నిలుపుకోలేని ఇతర నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి మాట్లాడుతూ తిరిగి అధికారంలోకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వస్తారని, మైదుకూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు గత ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కన్నా ఇంకా అధికంగా వచ్చేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శభాష్ 'రెడ్యం'

- విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న వైనం



కేశాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న రెడ్యం

బ్రహ్మంగారిమఠం : నాడు తెలుగుదేశం పార్టీలో అగ్రనేతగా వెలిగిన రెడ్యం పార్టీ మారినా ప్రజల కోసం ముందు వరుసలో ఉంటున్నారు. సోమవారం బి.మఠం మండలం ముడుమాల పంచాయతీ కేశాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రచారంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టిపల్లె రఘురామిరెడ్డిలను ముచ్చటగా మూడవ సారి గెలిపించాలంటూ ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. దీనిని చూసిన వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్తలు, నేతలు శభాష్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలలో జోష్ పెరిగింది.

ఎమ్మెల్యే గెలుపు కోసం ప్రార్థనలు

జరగబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అఖండ మెజార్టీతో గెలవాలని కోరుతూ వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సోమవారం కేశాపురంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యేను ఆయన కలిసి ఎమ్మెల్యే చేతికి కంకణం, టోపి, రుమాలు వేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి సారి ఎన్నికల ప్రచారం ప్రారంభంలో మదీనా దస్తగిరి ఈ విధానం పాటిస్తున్నారు.

జగనన్న పాలనలో ప్రజా సంక్షేమం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాగార్జునరెడ్డి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఆదిత్యారెడ్డి

పోరుమామిళ్ల: మండలంలోని మార్కాపురం, ఢిలితవాడల్లో సోమవారం సాయంత్రం పీఆర్ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ఓటర్లకు ఫ్యాన్ గుర్తు చూపించి ఓటు వేయాలని కోరారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ కొనసాగుతాయన్నారు. ప్రతి ఇంటికి మేలు జరుగుతుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెన్ను రాజశేఖర్, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ లక్కినేని ఓబయ్య, పంచాయతీ నాయకులు సీతారామిరెడ్డి, శివారెడ్డి, పరుశురాం, సుబ్బారెడ్డి, రామిరెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిత్యారెడ్డి ప్రచారం

పోరుమామిళ్ల: ఎన్నో సంక్షేమ పథకాలతోపాటు, విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో గణనీయ మార్పులకు శ్రీకారం చుట్టి, సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు చేరువ చేసిన జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం, ప్రజలు ఇంకా అభివృద్ధి చెందే అవకాశం ఉందని యువనేత డీసీ ఆదిత్యారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వైశ్యాబజార్, పొట్టిగారి వీధి, గాండ్లవీధుల్లో పార్టీ నాయకులతో కలసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో సచివాలయాల నియోజకవర్గ కన్వీనర్ కల్లూరు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ సీఎం బాషా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, ఉపసర్పంచ్ రాళ్లపల్లె నరసింహులు, మాజీ ఉపసర్పంచ్ నరసింహులు, మండల కో ఆప్షన్ మెంబర్ అల్లా, విద్యార్థి విభాగ జిల్లా ఉపాధ్యక్షులు చాపాటి సాయి నారాయణరెడ్డి, ఎంపీటీసీ ఇస్సాక్, వార్డు మెంబర్లు గురయ్య, మస్తాన్, షరీఫ్, కూల్‌డ్రింక్ బాబు, సుబ్బారావు, హబీబ్, బూతు మేనేజర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి



బయనపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

- ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి అని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని చింతలచెరువు పంచాయతీలోని శంకరాపురం, శ్రీనివాసపురం, శివరామనగర్, బయనపల్లె, బయనపల్లె ఎస్సీ కాలనీలలో ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ఏనాడూ పేదల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, నేడు ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఎలాగైనా అధికారం దక్కించుకోవాలన్న ఉద్దేశంతో మరోసారి మోసపూరిత హామీలతో ప్రజల ముందుకు వస్తున్నారని, వారి మాటలు ఎట్టిపరిస్థితుల్లో నమ్మి మోసపోవద్దని సూచించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పేదల తలరాతలను మార్చారని గుర్తుచేశారు. విద్య, వైద్య రంగంతోపాటు మహిళ, రైతు సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. పేదలందరికీ పారదర్శకంగా పథకాలు అంది వారి జీవితాలు మరింత మెరుగుపడాలంటే రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి గెలవడం ద్వారానే సాధ్యమవుతుందని, ఈ విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రామసుబ్బారెడ్డి, పెద్దపోలిరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌లు సుబ్బారెడ్డి, కుప్పాలరమణ, పద్మావతి, వేణు, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లు ఎక్కడ ఉన్నావు?

- టీడీపీ హయాంలో ఏమి అభివృద్ధి చేశావు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : గడిచిన ఐదేళ్లు ప్రజలకు అందుబాటులో ఉన్నావా... కనీసం కరోనా సమయంలో కనిపించావా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు శివప్రసాదరెడ్డి.. టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో సోమవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లు కనిపించని వరద పార్టీ టికెట్ తీసుకుని నేరుగా ఎన్నికలకు వచ్చి ఓట్లు అడుగుతున్నాడన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉందని, ఆ సమయంలో ఆ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న మీరు సాధించిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. ప్రత్యేకంగా రూ.కోటి నిధులు మంజూరు చేయించిన పరిస్థితి ఉందా అని అడిగారు. తనను అవినీతిపరుడని మాట్లాడుతున్న వరదరాజులరెడ్డి ఈ ఎన్నికల్లో రూ.60 కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయనకు ఆ డబ్బు ఎలా వచ్చిందని అడిగారు. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయనకు శనగ, పత్తి అమ్మింటే డబ్బు వచ్చిందా అని చెప్పాలన్నారు. రాజకీయ జీవితంలో వరదరాజులరెడ్డి అవినీతికి, అక్రమాలకు అసాంఘిక కార్యక్రమాలకు మద్దతు పలకలేదా, హత్యలను ప్రోత్సహించలేదా, అధికారాన్ని దుర్వినియోగం చేయలేదా అని ప్రశ్నించారు. నీవు, నీ బంధువులు చేస్తే ఒక నీతి, నీ శత్రువులు చేస్తే మరొక నీతా అన్నారు. అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని ప్రజలను కోరారు.

సంక్షేమం కోసం జగన్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

జగన్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. టీడీపీ హయాంలో ఆవగింజంత అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. చేనేత కార్మికులతోపాటు అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను మంజూరు చేసిందని, రూ.150 కోట్లతో ప్రజలకు తాగునీరు అందించామన్నారు. కూరగాయల మార్కెట్, పెన్నానదిపై బ్రిడ్జి, ఆర్టీసీ బస్టాండ్ పనులు జరుగుతున్నాయన్నారు. పార్కులను అభివృద్ధి చేశామన్నారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి భూములు కొనుగోలు చేసి ఇళ్ల పట్టాలు అందించిందన్నారు. ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిందన్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా ఉన్నానని, తాను, తన పార్టీ శాంతియుత వాతావరణం కోసం కృషి చేశామన్నారు. ప్రచారంలో 30వ వార్డు కౌన్సిలర్ మీగడ దీప్తి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభుత్వ వైఎస్సార్‌సీపీ నాయకుడు శేగిరెడ్డి గంగిరెడ్డి, గంగాధర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, రాచమల్లు రాఘవేంద్రారెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ ప్రశాంతి, రమణారెడ్డి, ఇంద్రారెడ్డి, మాధవ్‌రెడ్డి, మార్తల లక్ష్మిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, తమటం చెన్నారెడ్డి, పాతకోట శ్రీనివాసులరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, మీసాల లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప జయంత్యుత్సవం



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

పోరుమామిళ్ల: పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ఆవరణలో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి గుడిలో సోమవారం స్వామి జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయ గౌరవ అధ్యక్షుడు తులసి సుధాకర్ ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు, భజనలు చేశారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి 7 వరకు అయ్యప్ప మూలవిరాట్‌కు కుంకుమ, పసుపు, పన్నీరు, తేనె, పెరుగు, పాలు, విభూతి, పూలు, గంధం, పంచామృత అభిషేకాలు చేశారు. అయ్యప్పభక్తులు కీర్తనలు, భజనలు, పాటలతో భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు రంగనాయకులు, శ్రీధర్, మధు, యోగా గురూజీ గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

రాజుపాళెం : సార్వత్రిక ఎన్నికలలో భాగంగా సోమవారం ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి నూర్‌బాషా, కానిస్టేబుల్ శ్రీనివాసులు వాహనాలను తనిఖీ చేశారు. ప్రొద్దుటూరు నుంచి రాజుపాళెం మీదుగా ఆళ్లగడ్డకు వెళ్లే రహదారిలో రాజుపాళెం వద్ద కార్లు, లారీలు, బస్సులు, ద్విచక్రవాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా డబ్బు తీసుకెళుతుంటే వాటికి కచ్చితంగా రశీదులు ఉండాలని, లేకుంటే సీజ్ చేసి ట్రెజరీలో అప్పగిస్తామన్నారు.

అన్న ప్రసాదం పంపిణీ



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న శ్రీనివాసులస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడురోడ్డులోని మున్సిపల్ పెట్రోల్‌బంకు సమీపంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా శ్రీ కాలభైరవస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వినియోగం జరిగింది. 300 మందికి పైగా భక్తులకు రాజేశ్వరి, ప్రభాకర్, మౌనిక, శ్రవణ్‌కుమార్ సహకారంతో అన్నప్రసాదం చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాసులస్వామి తెలిపారు. ముందుగా రామేశ్వరంలోని కాలభైరవస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సేవకులు నీరజ్, శివ, ప్రేమ్, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హనుమ వాహనంపై మాధవస్వామి

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో మాధవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి హనుమంతుడి వాహనంపై స్వామిని పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పులకించిపోయారు.

ఘనంగా గౌరపౌర్ణమి వేడుకలు



శ్రీకృష్ణ, బలరాములకు మహా పుష్పాభిషేకం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సోమవారం గౌరపౌర్ణమి వేడుకలను అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ బలరాముల విగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భజన, కీర్తన, హారతి, మహా శంఖాభిషేకం, మహా పుష్పాభిషేకంలను నిర్వహించారు. భగవద్గీత ప్రవచనాలు చేశారు. మహాహారతి తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా 30 వేల మంది భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. ఉదయం కొర్రపాడు రోడ్డులోని ఇస్కాన్ కేంద్రంలో శ్రీకృష్ణుడు, బలరాములకు విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. ఇస్కాన్ కేంద్రం నిర్వాహకుడు మధురేసుదాసు శ్రీకృష్ణుడి లీలను, భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు మారుతిప్రసాద్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీనివాసుని కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : మండల పరిధి అనంతరాజుపురం పంచాయతీలోని లక్ష్మీపాళెం గ్రామంలో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన స్వామివారి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. ఇందులో భాగంగా తొలుత శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి కల్యాణ వేదికపైకి చేర్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం స్వామివారిని గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు భరద్వాజ్, ఆలయ కమిటీ చైర్మన్ మెంటా అశోక్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు కామసముద్రం హర్షబాబు, మెంటా చంద్రయ్య, పెద్ద వీరయ్య, రమణమ్మ, లక్షుమ్మ, సుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ, చిన్నగురవయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో బంగారు మునిరెడ్డి, రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ సుందరయ్యనగర్ కాలనీకి చెందిన 50 కుటుంబాలు సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి నేతలు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీజేపీ నుంచి తాము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.

కమనీయం.. నరసింహస్వామి కల్యాణం

వల్లూరు : లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మండలంలోని మాచిరెడ్డిపల్లెలో సోమవారం స్వామి కళ్యాణ మహోత్సవం వైభవగా సాగింది. అందంగా అలంకరించినన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వాముల ఉత్సవ మూర్తులను ఆశీనులను చేసి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య ఆశీనులను స్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు కనులారా వీక్షించి పులకించిపోయారు. అనంతరం అన్నదానం చేశారు. గత ఐదు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవ కార్యక్రమాలు సోమవారం ధ్వజావరోహణం, పూర్ణాహుతి కార్యక్రమాలతో ముగిశాయి. ఉదయం పాలపళ్ల విభాగం ఎద్దులచే, సాయంత్రం సేద్యపు విభాగం ఎద్దులచే నిర్వహించిన బండలాగుడు పోటీలు ఆసక్తికరంగా సాగాయి. సాయంత్రం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రాకార రథోత్సవం

జమ్మలమడుగు : పట్టణంలోని నారాపుర వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రాకార రథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఫాల్గుణ మాసం పౌర్ణమి సందర్భంగా ఆలయంలో టీటీడీ, శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై కొలువుంచి ఊరేగింపు జరిపారు. భక్తులు స్వామివారి రథాన్ని లాగడం కోసం పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఇన్‌స్పెక్టర్ మోహన్, అర్చకులు రాజేష్ స్వామి సుధాకర గుప్త, వెంకట కృష్ణుడు, శ్రీనివాసులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.